కథానిక

శత్రువు

శ్రీ నిర్మల్ కుమార్ ముస్తాఫీ

★

అఖిలభారత పోటీలో నాల్గవ బహుమతినిపొంది, ప్రపంచపోటీకి పంపబడిన నాలుగవ కథ. నిర్మల్‌కుమార్ ముస్తాఫీ ఈకథను ఆంగ్లంలో రచించి పోటీలో పాల్గొన్నారు. వీరు ఇప్పుడు చంద్రనగర్ ప్రభుత్వకళాశాలలో ఆంగ్లశాఖలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

★

దబాదబా బూట్లచప్పుడు; ట్రైనింగ్ కాంప్ నుంచి సిపాయిలను విడుదల చేశారు. ఎక్కడివాళ్లక్కడ గుంపులు గుంపులుగా వెళ్లిపోతున్నా, హెర్మన్ సైనికశ్రేణిలో వున్నట్టు ఇంకా అలానే నిల్చునున్నాడు. ట్రైనింగ్ కాంప్ కమాండర్ సందేశ వాక్యాలు ఇంకా అతని చెవుల్లో మారుమోగుతూనే వున్నయ్. 'మాతృదేశంయొక్క గౌరవప్రతిష్ఠలను పరిరక్షించే మహత్తరమైన బాధ్యత మీ భుజస్కంధాలమీద వుంది. ఈ బాధ్యతను నిర్వహించుకోగలగటానికి ఈ కేంద్రం మీకు తగిన శిక్షణనిచ్చి తరిఫీదు చేసింది. మీరు పేల్చే ప్రతిగుండూ ఒక శత్రువును రూపుమాపాలి! మీరు పొడిచే ప్రతి (తుపాకి) సన్నీ పోటూ ఒక శత్రువు హృదయాన్ని చీల్చాలి. మీ నేత్రాలకు సునిశితమైన లక్ష్యదశుద్ధినీ, మీ హస్తాలకు అచంచలమైన లాఘవాన్నీ భగవంతుడు ప్రసాదించుగాత!'—

'లక్ష్యశుద్ధిగల నేత్రాలూ — లాఘవంగల హస్తాలూ'—ఈమాటలు తనలో తను గొణుక్కుంటూ, హెర్మన్, పెరేడ్ మైదానానికి అడ్డంపడి దిగులుగా నడుస్తున్నాడు.

శిశిర ఋతువు; ప్రొద్దు గర్భాన పడ్డది. మసక మసకగా చీకట్లు క్రమ్ముకొస్తున్నయ్. హెర్మన్ వెనక్కు తిరిగి నిర్మానుష్యంగా వున్న కాంప్‌వంక చూచాడు. చుట్టూవున్న పొలాలమీద తెరదించినట్టు పొగమంచు వ్యాపించివుంది. అతని మనస్సు యింటిమీద పోయింది. కళకళలాడే తన గృహానికీ ఈ వాతావరణానికీ ఎంత వ్యత్యాసముంది! ప్చ్! లాభమేమిటి? ఇప్పుడు ఇంటికి తిరిగివెళ్లే అవకాశం లేదు. వెంటనే రణక్షేత్రానికి వెళ్లిపోవాలని ఉత్తరువులు! తన మనస్సులో కలుగుతున్న విచారాన్ని తోటిసైనికులతో చెప్పుకుని వాపోయాడు.

'ఇలాంటి విచారాలు పనికిరావురా! భయ్యా! —శత్రువు చెయ్యి దాటి తప్పించుకు పారిపోతే తప్ప మరిక దేనికి విచారపడగూడదు'—ఇది బిల్లీ సలహా.

'సైన్యంలో వున్నవాడికి ఇలాంటి ముచ్చట్లూ, మురిపాలూ ససేమీ రంజించవనుకో'—ఇది తక్కినవారి మందలింపు.

తన తెలివితక్కువకు పశ్చాత్తాపపడుతున్నట్టు మొహం బెట్టి, హెర్మన్ క్షమార్పణ చెప్పుకుంటున్నట్టు అన్నాడు: 'నిజవే—ఇలాంటివి మంచివి

కావు—కాని నాలో అప్పుడప్పుడు ఇలాటి పిచ్చి ఊహ లేవో పుడుతూ వుంటాయి—మళ్ళీ ఇట్టే క్షణంలోఅంతరించిపోతాయనుకోండి' —అన్నాడు. చేతినున్న గడియారంవంక చూసుకున్నాడు. ఒక రెండు గంటలు మాత్రమే వ్యవధి వుంది: 'టైమైపోతోంది— సామానూ జట్టా సర్దేసుకోవద్దూ ?' అన్నాడు. అతని వెంబడే తక్కినవాళ్లు కూడా, బారకాసులవేపు బయలుదేరారు.

హెర్మన్ సర్వసన్నాహాలూ పూర్తిచేసుకుని నిల్చునున్నాడు. కన్నూ కన్నూ పొడుచుకున్నా కనుపించని చీకటి—అంధకారం; ఆ చీకట్లో అతని చుట్టూ అనంతమైన సంచలనం. కళ్ళు పెకల్చుకు చూస్తే ఆ చీకట్లో పెనుభూతాల్లా మిలిటరీ ట్రక్కులు కనుపించుతున్నయ్. చాలా చలిగా వుంది. చేతులకు 'గ్లావ్స్' తొడుక్కున్నాడు. నెమ్మదిగా ముందుకు నడిచి, ఆ లారీల ప్రక్కకు పోయి నిల్చున్నాడు. రెండు మూడు నిమిషాలు అలానే నిల్చున్నాడు. ఇంతలో దూరాన చక్రాల చలనం వినిపించింది. 'ఓహో ! బయలుదేరుతున్నట్టున్నయ్' — అనుకున్నాడు. ట్రక్కులోకి ఎక్కేశాడు. ట్రక్కులో తొలగదొయ్యటానికి సందులేకుండా క్రిక్కిరిసి వున్నారు. కాస్త విశ్రాంతిగా కూర్చుని ప్రయాణం చేసే సావకాశం వుంటుందనుకున్నాడు. కాని మోకాళ్లు డొక్కల్లోకి ముడుచుకుని గొంతుక్కూర్చుని ప్రయాణం చేయవలసి వచ్చింది. లారీ గర్రుమని కదిలింది. లారీ వడివడిగా పోయినకొద్దీ, చలిగాలి జివ్వు జివ్వున ముఖంలోకి బాదుకుని ముఖం వాచిపోతోంది. నుదురుతుడుచుకుని, చినుకులు వ్రేళ్లతో చిలకరించుతున్నాడు.

హెర్మన్, అతని సహచరులూ యుద్ధరంగంలో దిగారు. పరిస్థితులు అంత అధ్వాన్నంగా వుంటాయని వాళ్లు యెప్పుడూ ఊహించలేదు. ట్రైనింగ్‌లో వున్నప్పుడు, సైనికుడు దుస్తుల విషయమై తీసుకోవలసిన శ్రద్ధనుగురించి వీరందరికీ ఎంతో ఉదాత్తమైన అభిప్రాయా లుండేవి. ఇక్కడి పరిస్థితుల్లో అలాంటి అభిప్రాయాలన్నీ తుక్కుతుక్కయిపోయాయి. జీవాలు నిలిచివుండటానికి, కావలసిన కనిష్ఠావసరాలు లభించటం అక్కడికి బ్రహ్మప్రళయం. ప్రాణాలు నిలిపివుంచుకోవటానికి కచ్చగా పోరాడే అడవిమృగాల ఆవేశం వాళ్ళల్లో పొటమరించింది. ఒక కందకంలో తలదాచుకుని, ఆకలిబాధ తీర్చుకోవటానికి ఆ వేళకు అందిన కబళాలను ఆప్యాయంగా తింటున్నారు. ట్రైనింగ్ కాంపులో వుండగా వీరభోగ వసంతరాయిళ్లలా అనుభవించిన అనుభవాలను తలపుకు తెచ్చుకుని, వర్తమాన స్థితికి లోలోపల దురపిల్లుతున్నారు.

ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకుందామనే మానవ సహజమైన ఉత్సాహంకూడా నశించి ఎవరికి వారు మౌనంగా కూర్చుని ఆ కాస్త ముద్దా గొంతులో వేసుకుంటున్నారు. ఇంతలోనే సమీపంలో సైరన్ ధ్వని వినిపించింది. మరుక్షణంలో ఎక్కడనుంచో రివ్వున ఒక ఫిరంగిగుండు ఎగిరివచ్చి కందకం అంచుకు కొట్టుకుని 'ధన్' మని పేలింది. మట్టె, దూగరగా పైకి లేచి కూళ్లనిండా పడ్డది. ఆ చీకట్లో ఏమీ కనుపించక హెర్మన్ ఇంకా అలా తింటూనే వున్నాడు. నోట్లో బెట్టుకున్న ముద్ద మట్టికంపు కొట్టింది. అతనికి చిరాకెత్తిపోయి అవతల పారేద్దామనుకున్నాడుగాని, ఆకలితో వుండటంచేత ఎలాగోలా ఆ రెండుముద్దలూ నోట్లో కూరుకున్నాడు. యుద్ధరంగంలో జీవితం అంటే ఇదికాబోలు, కనీసం ఈ రకంగా వుంటుంది కాబోలు ననుకున్నాడు.

ఫిరంగికాల్పులు సమసిపోయినై. హెర్మన్ బృందానికి ఉత్తరువులు అందినై: 'దొంగచాటుగా బయలుదేరివెళ్లి శత్రుస్థావరాలను రూపుమాపాలి.' ఆ ఉత్తరువులప్రకారం ముందుకు సాగిపోతున్నారు. ఉన్నట్టుండి, శత్రుశ్రేణి ముందు జాజ్వల్యమానంగా ఏవో మంటలు కనుపించినై. ఆ మంటల కాంతిలో పరిసరాలన్నీ శత్రువుకు విస్పష్టంగా కనుపించినై. వెంటనే శత్రుఫిరంగులు మృత్యువును వర్షించటానికి ప్రారంభించినై. ఇటు ఎడమవైపున ఒక గుండు అటు కుడివేపుగా ఒకటి — నెత్తిమీదుగా రివ్వున ఎగసిపోయేదొకటి! బిల్లీకూడా హెర్మన్‌ప్రక్కనే

నేలమీద పాకుతున్నాడు. పట పటా పళ్లు కొరికి: 'అక్కడికి చేరాలే గాని...ఆ కుక్క వెధవల్ని...నాశ...'; ఇంకా ఆ వాక్యం ముగియకముందే 'సర్ ర్' మంటూ ఒక తుపాకిగుండు ఎగిరివచ్చి అతని గుండెల్లో కొట్టుకుని, అతన్నీ అతని కచ్చనూ కూడా అంతంచేసి వేసింది. హెర్మన్ ఓల్ఫ్ ప్రక్కనే మోకరిలి, అతని శరీరాన్ని తడవిచూచాడు. మృత్యువు ఎంత నిర్దాక్షిణ్యంగా సర్వాన్నీ అంతం చేసి పారేస్తుందో అతనికి అర్థమైంది. "పేల్చిన ప్రతి గుండూ ఒక శత్రువును రూపుమాపాలి" అనే వాక్యాలు తిరిగి అతని స్మృతిపథంలో వినిపించినై. చివాల్న లేచి నిల్చున్నాడు. మొండి ధైర్యంచేసి ముందు కురికేశాడు.

చుట్టూ చీకటి అంధకారం: గగనపథాన అక్కడక్కడ నక్షత్రాలు మాత్రం మినుకు మినుకు మంటున్నయ్. పైన ఆకాశం ఎంతటి విస్తృతావధిని పఱచుకుని వుందో, క్రింద అగ్నిగోళాలు వర్షించుతున్న ఆ రణక్షేత్రం కూడా అంత విస్తృతావధిని పఱచుకుని వున్నట్టు కనుపించుతోంది. ఆ రణక్షేత్రానికి మధ్యగాబడి హెర్మన్ ముందుకు సాగుతున్నాడు. ఫిరంగిగుండ్లు భూగర్భాన్ని భీభత్సంగా ఛిన్నాభిన్నం చేసేస్తున్నయ్. తుపాకులు నిప్పులు చెరుగుతున్నయ్. 'మోర్టారులు' అగ్నిగోళాలను విసిరివేస్తున్నయ్. వీటి భీభత్సరావంలో హతభాగ్యుల హాహాకారాలు కూడా కలిసి ప్రళయసంఘోషంగా వుంది. అలా నేలనుబడి పాకిపోవటంతో హెర్మన్ మోకాళ్లు కొట్టుకుపోయి రక్తాలోడుతున్నాయి. కాని అతను లక్షించలేదు. ముందుకు సాగుతున్నాడు. శత్రువుల మెషిన్‌గన్ దళంవున్న స్థావరం అనతిదూరంలో వుంది...ముప్ఫై అడుగుల దూరం! నేలనుబడి ప్రాకులాడుతూ, క్రమేపీ ఆ స్థావరం దగ్గిరికి చేరుకుంటున్నాడు. చీకటి పిశాచాలు నిల్చున్నట్టు ఇప్పుడు అక్కడున్న మనుషులు అతనికి స్పష్టంగా కనుపించుతున్నారు. చేతిబాంబు తీసుకుని విసిరెయ్యడానికి సిద్ధంగావున్నాడు. ఇంతలోనే శత్రుశ్రేణిముందు మరొక పర్యాయం, హఠాత్తుగా మంటలు లేచాయి. యుద్ధభూమి యావత్తూ పట్టపగలై కనిపించింది. శత్రువులు అతనిమీద ఒక్కుమ్మడి తుపాకిగుండ్లు కురిపించారు. మరుక్షణంలో ఆ శత్రుస్థావరం కూడా పేలిపోయింది—హెర్మన్ విసిరిన చేతిబాంబు దాని సమాధానం అది చెప్పేసింది. అలాంటి స్థితిలో మృత్యువు అనేది అసందిగ్ధం—అటు శత్రువును కబళించుతుందో, ఇటు మన్నే కబళించుతుందో చెప్పలేము. ఈ తలపుతో అతనికి ఎంతో విచారమేసింది.

'ఏది యేమైనా, నా బాధ్యతను నేను నిర్వహించాను' అని నచ్చచెప్పుకుని తనను తాను అభినందించుకున్నాడు. అక్కడే ఆగి క్షణం విశ్రాంతి తీసుకుని ఊపిరి పీల్చుకున్నాడు. లేచి నెమ్మదిగా ముందుకు సాగాడు. బాంబు పేలటంవల్ల యేర్పడిన ఒక పెద్దగోతిలో తలక్రిందులుగా పడిపోయాడు. తల దుమ్ములో కూరుకుపోయింది. మోకాళ్లకు బలంగా దెబ్బలు తగిలాయి — మోకాటిచిప్పలు తొలగిపోయాయేమో కూడా; ఆ మోకాళ్ల బాధ భరించలేక చేతులతో పతుకున్నాడు. చేతులనిండా రక్తం! భూమండలం యావత్తూ ఒక్కసారి గిర్రున తిరిగిపోతున్నట్టు తల తిరిగిపోయింది—ఉండీలేని స్పృహ—గోతి అంచుమీద చారబడిపోయాడు. తడిమట్టి చిదుపలు చిదుపలుగా పైనించి నెత్తిన పడుతోంది. నోటివెంట చొంగకూడా బయటికి వస్తోంది.

అతనికి తిరిగి స్పృహ వచ్చేసరికి తెలతెలవారుతోంది. నెమ్మదిగా కళ్లువిప్పి మోకాళ్లవంక చూచుకున్నాడు. మోకాళ్లు రెండూ బాడెలైవున్నాయి. లేచి నిల్చోటానికి ప్రయత్నించాడు—కాని కాలు కదపలేకపోయాడు. ఆ హతాశలో ఆవుర్న యేడిచెయ్యాలనిపించింది. 'నిన్న—నిన్న నేగా!...'

తన తుపాకి యెక్కడున్నదా అని చుట్టూ చూసుకున్నాడు. తుపాకి సన్నీ అతని నెత్తిమీదనే తళతళా మెరుస్తోంది, గోతి ఒడ్డుమీదనుంచి. అతను గోతిలో పడిపోయినప్పుడు తుపాకి జారి గోతివడ్డున పడ్డది. కొంచెం పైకి లేచి చెయ్యెత్తితే అందే స్థితిలో వుంది—కొంచెం పైకి లేవగలిగితే చాలు! సరే పోనీ మనుకుని, యేమి చెయ్యటానికీ తోచక—కాస్త

రొట్టెముక్కన్నా కొరుక్కు తిందామని, జేబులో నుంచి పొట్లాం తీసి విప్పుతున్నాడు. ఒక ముక్క మునిపంట కొరికాడో లేదో...అడుగుల చప్పుడు! నిర్ఘాంతపడి వదిలివేశాడు. ఇంకా ఇంకా చేరువౌతున్న అడుగుల చప్పుడు! తల పైకెత్తి చూచాడు. ఒక మానవముఖం గోతి అంచుమీదనుంచి తనవంక తొంగిచూస్తోంది—ఉక్కు టోపీరంగునుబట్టి గుర్తుబట్టాడు—శత్రువు!

కలవరంగా లేచి తుపాకీ అందుకోబోయాడు—మోకాళ్ళు విరిగిపోయిన సంగతి జ్ఞప్తిలేక—'అమ్మో' అని ఆర్తనాదం చేస్తూ గోతి అంచుమీద పడిపోయాడు.

అతనికి తిరిగి తెలివివచ్చి కన్నువిప్పి చూసేసరికి ఆందోళనతో కించపడుతున్న ఒక ముఖం అతనివంక జాలిగా చూస్తోంది—గోతి అంచుమీద కనుపించిన ఆ ముఖమే—హెర్‌మన్ గుర్తుపట్టాడు. శత్రువు నుంచినీటి 'ఫ్లాస్కు' బయటికితీశాడు. మూత తీసి హెర్‌మన్ నోటికందించాడు. హెర్‌మన్ అతనివంక ఆశ్చర్యంగా చూశాడు. 'తాగు తమ్ముడూ!' — అన్నాడు. శత్రువు దుస్తులలోవున్న ఆ మానవుడు. ఎడమచేత్తో, హెర్‌మన్ శిరోజాలను జాలిగా దువ్వాడు. హెర్‌మన్ దీనుడై తన మోకాళ్లవంక చూసుకున్నాడు—అతన్ని చూడమన్నట్టు. చినిగి జీబులైపోయిన లాగూలోనుంచి రెండు మోకాళ్ళూ ఎద్దుపుండ్లులా బాడలై కనుపించుతున్నయ్. 'మోకాళ్లు బాగా బాధగావున్నాయా తమ్ముడూ!' అన్నాడా వ్యక్తి. ఆ మాట్లాడుతున్నవాడు నిజంగా శత్రుపక్షానికి చెందినవాడని హెర్‌మన్ నమ్మలేకపోతున్నాడు. అతనితో మాట్లాడకుండా మొండిబతిచి మౌనం వహించాలనుకున్నాడు గాని, అతని అదుపులో వుండక దుఃఖసంతప్తాలైన అతని రెండుకళ్లూ కన్నీటిని విడిచివేసినయ్.

'బలంగా దెబ్బలు తగిలినట్టేవున్నయ్!—మనం డాక్టరు నెవణ్ణైనా చూడాలిసిందే'—

'డాక్టర్ ఎక్కడ దొరుకుతాడిక్కడ'—హెర్‌మన్ హతాశుడై అన్నాడు.

'ఈయుద్ధరంగంలో మీ హాస్పిటల్ ఏ ఛాయల వుందో చెప్పగలవా తమ్ముడూ?'—

ఆ వ్యక్తి తన్ను పరియాచక మాడుతున్నాడను కున్నాడు హెర్‌మన్: కొంచెం కచ్చగానే అన్నాడు: 'అక్కడికి వస్తే, నిన్నేం చేస్తారో అదేమన్నా కొంచెం ఆలోచించావా...?'

'అవును, ఖైదు చేస్తారు.—లేదా చంపుతారు' అని చిరునవ్వు నవ్వాడు: 'కాని మానవుడుగా నా బాధ్యతను నేను నిర్వహించుకున్నవాణ్ణవుతాను.

'బాధ్యతను నిర్వహించుకున్న వాణ్ణవుతాను' —ఇవే మాటలు తానూ లోగడ అనుకున్నాడు. కాని ఆ సందర్భం జ్ఞప్తికి వచ్చి సిగ్గుపడి తలవంచుకున్నాడు.

ఆ వ్యక్తి ఏదో ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నట్టు నెత్తిమీది ఉక్కుటోపీ తీసి తుపాకిసన్నీకి తగిలించి, తుపాకి చేత్తో బట్టుకుని లేచి నిల్చున్నాడు. మౌనంగా నిల్చుని రెండు క్షణాలు ఆలోచించాడు. దబాల్న తుపాకీ నేల పారేశాడు. ఉక్కుటోపీ తీసి తిరిగి నెత్తిన బెట్టుకుని దానితోలు పటకాలు గడ్డంక్రిందికి గట్టిగా బిగించుకున్నాడు.

'సరే తమ్ముడూ—ఇక చెప్పు!—హాస్పిటల్ ఏ వేపు నుంది,' అతి ప్రశాంతంగా అడిగాడు.

'ఇంతకీ నువ్వు ఏమిచేద్దామని'—అతని ధోరణి బోధపడక హెర్‌మన్ అశ్చర్యపడుతూ ప్రశ్నించాడు.

'చెప్తానుగా—హాస్పిటల్ సంగతి చెప్పలేదే!'

'అటు ఉత్తరంగా చర్చి గోపురం కనుపించుతోంది కదూ—ఆ చర్చిదగ్గిరే వుంది మా హాస్పిటల్!

అతను నిల్చుని చుట్టూ పారజూచాడు. చర్చి గోపురం కనుపించింది. సరే, చాలా దూరమే—శత్రుస్థావరాల మధ్య వుంది. అతను హెర్‌మన్ ప్రక్కనే, మోకాటి తండావేసి కూర్చున్నాడు. 'పాపం! కదిలిస్తే బాధపెడుతుందేమో—ఎల్లాగైనా క్షణం ఓర్చుకో' అంటూ హెర్‌మన్ను నెమ్మదిగా రెండు చేతులా పైకెత్తి, నెమ్మదిగా గోతి అంచుమీద పడుకోబెట్టాడు. తానుకూడా గోతిలోనుంచి

పైకి ఎక్కివచ్చాడు. హెర్మన్ ప్రక్కనే నేల మీద బోర్లగా పడుకున్నాడు. ‘తమ్ముడూ! నీకేం ఫరవాలేదు; నెమ్మదిగా నా వీపుమీదికి ఒత్తిగిలి నా మెడ కావిలించుకుని హాయిగా పడుకో!”

హెర్మన్ను వెన్నుమీద పడుకోబెట్టుకుని అర చేతులతోనూ, పాదాల మునివేళ్లమీదనూ నేలమీద వానపాములా పాకిపోతున్నాడు—చర్చి గోపురం కనుపించుతున్న దిశగా. అలా గంటల తరబడిపాకాడు. అతని ఒళ్ళంతాకూడా కొట్టుకుపోయి నెత్తురు కారుతోంది. ఆ కదలికతో హెర్మన్‌కు కూడా చాలా బాధగానే వుంది. కాని చర్చిదగ్గిరికి వచ్చేసరికి అతనికి ఎంతో హాయి మనిపించి ప్రాణం లేచివచ్చినట్టయింది. అతని వెన్నుమీదినుంచి నెమ్మదిగా క్రిందికి దొర్లాడు. అతన్ని అక్కడికి జేరవేసుకొచ్చిన ఆ వ్యక్తి లేచి మోగాళ్ళమీద కూర్చున్నాడు. రక్తధారలు ఓడుతూ, దుమ్ముకొట్టుకుని భీభత్సంగా వున్నా, అతని ముఖంలో వెన్నెలలా ఏదో ఒక మహా తేజం ప్రకాశించుతోంది. దేవతల ముఖాలు ఇలాగే వుంటాయి గాబోలు ననుకున్నాడు హెర్మన్. కాని ఇంతలో మోకాళ్లు మళ్లీ అపరిమితంగా బాధపెట్ట సాగినై. మోకాళ్ళకు కట్టిన కట్లు మళ్ళీ రక్తంతో తడిసినై. తన కృతజ్ఞతను తెలుపుతూ అతని వంకచూసి ఒక చిరునవ్వు నవ్వాలనుకున్నాడు కాని, పెనవేస్తున్న బాధతో చుట్టలు జుట్టుకుపోయాడు—స్పృహ లేకుండాపోయింది.

తిరిగి హెర్మన్‌కు తెలివి వచ్చేసరికి అతని చుట్టూ కొంతమంది నిల్చున్నారు. అతని కిప్పుడేమీ జ్ఞప్తికి రావటంలేదు. నెమ్మదిగా మనో బలాన్ని కూడదీసుకుని: ‘ఆ మనిషేడీ?’ అని గొణిగాడు.

‘వాడి గ్రంథం కనుక్కున్నాంలే—నీ కెందు కింకా ఆ బెంగ — దొంకిపోయావని కులుకుతున్నాడు వెధవ, అదృష్టం—సమయానికి వచ్చాం; ఒక్క గుండుదెబ్బతో తల పేలిపోయింది వెధవకి—అసలు ఆ కుక్కవెధవ, మన హాస్పిటల్ చుట్టూ తచ్చాడటానికి తెగించినందుకు చెప్పాలి!—ఏమిటి వాడి వెధవ ధీమా!!’

‘ఆ సమాధానంతో హెర్మన్ ప్రాణాలు ఆవటించిపోయినై. ఆ మానవులవంక చూడలేక మొగం తిప్పేసుకున్నాడు. పెద్దపెట్టున యేడిచెయ్యాలనే క్షోభ కలిగిందిగాని—ఏడవలేకపోయాడు.

శిథిలావస్థలోవుండికూడా, సూర్యకిరణాలుపడి ధగధగా మెరుస్తున్న చర్చిగోపురంమీద అతని చూపులు లగ్నమై పోయినై.